క్లుప్తంగా

నేడు కంచికచర్లలో పీజీఆర్ఎస్

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆయా సమస్యలపై ప్రజలు అందజేస్తే అర్జీలను ప్రాధాన్యక్రమంలో పరిష్కరిస్తామని వివరించారు. ఈ సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయ అధికారుల చర్యలను తప్పుపట్టిన చైర్మన్

పెనుగంచిప్రోలు: భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఆలయ అధికారుల చర్యలు ఉండటం తగదని పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీతిరుపతమ్మవారి ఆలయ రాజగోపురం, పార్కింగ్, కేశఖండనశాల, వాహనాల పూజ వద్ద బొట్టు పెట్టే హక్కునకు ఆలయ అధికారులు టెండర్లు పిలవడం సరైన చర్య కాదన్నారు. ఆలయం వద్ద ప్రతిఅంశాన్ని వ్యాపార ధోరణిలో చూడటమంటే భక్తుల మనోభావాలను కించపరచడమేనన్నారు. చివరకు భక్తులకు బొట్టు పెట్టే అంశాన్ని కూడా ఓ హక్కుగా మార్చి కాంట్రాక్టు ఇచ్చేలా ఆలయ అధికారులు నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఈ విషయాన్ని పాలకవర్గం తరపున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశాన్ని స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) దృష్టికి కూడా తీసుకెళ్లగా, ఆయన కూడా సానుకూలంగా స్పందించినట్లు చైర్మన్ శ్రీనివాసరావు వివరించారు.

11,12 తేదీల్లో అమ్మవారి చీరల వేలం

నందిగామరూరల్: మండలంలోని లింగాలపాడులో వేంచేసియున్న లక్ష్మీ పేరంటాళ్లు అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలకు ఈనెల 11, 12తేదీల్లో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నరసింహమూర్తి తెలిపారు. ఆసక్తిగలవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా తాళ్లూరి పార్వతి



చిల్లకల్లు(జగ్గయ్యపేట): చిల్లకల్లుకు చెందిన మాజీ ఎంపీపీ తాళ్లూరి పార్వతి వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ వడ్డెరుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆమె నియామకంపై వడ్డెర సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు : తాతయ్య

జగ్గయ్యపేటఅర్బన్: నియోజకవర్గంలో ప్రతి రైతుకు సమయానికి ఎరువులు అందేలా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ తెలిపారు. రం వ్యవసాయశాఖ అధికారులతో ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 50 వేల ఎకరాల్లో పంటలసాగుకు అవసరమైన ఎరువుల సరఫరాను మండలాల వారీగా ప్రణాళికాబద్ధంగా అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకు రైతులకు 2,792 టన్నుల యూరియా ఎరువులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈనెల 15 వ తేదీ లోగా మరో 1000 టన్నులు, ఈనెలాఖరు నాటికి మరో 1500 టన్నుల ఎరువులు అందుబాటులోకి వచ్చేలా తక్షణ చర్యలు చేపడుతున్నామని వివరించారు.

పలు ఆలయాలు మూసివేత



నందిగామరూరల్: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి మండలంలోని ఆయా గ్రామాలల్లోని ఆలయాలను అధికారులు మూశారు. మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారు, దాములూరు కూడలి గ్రామంలోని సంగమేశ్వర స్వామి వారి ఆలయాలతో పాటు పట్టణంలోని రామలింగేశ్వర స్వామి, సాయి అయ్యప్ప, వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు, మరిడీ మహాలక్ష్మీ అమ్మవారు. సిద్ధిబుద్ధి సహిత వరసిద్ధి వినాయక స్వామి, చెన్నకేశవస్వామి, సీతారామాంజనేయ స్వామి వారి ఆలయం, తదితర ఆలయాలను ఆయా ఆలయాల అధికారులు మూసేశారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు సంప్రోక్షణ అనంతరం ఆయా ఆలయాలలో భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపారు.

రేపు వాహనాల వేలం

మైలవరం: మైలవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 9వ తేదీన వేలం నిర్వహిస్తామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాలకు అప్సెట్ ప్రైస్ నిర్ణయించి వేలం పాట జరుపుతున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు మైలవరం ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

రైతులకు తప్పని యూరియా కష్టాలు



జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట మండలంలోని రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. జగ్గయ్యపేట కృష్ణా ఫార్మర్స్ కోపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని అనుమంచిపల్లి రైతుసేవా కేంద్రం వద్ద ఆదివారం యూరియా పంపిణీ చేస్తామని అధికారులు తెలపడంతో ఉదయం ఆరుగంటల నుంచే రైతులు బారులు తీరారు. గ్రామపరిధిలో సుమారు రెండువేల ఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో మాగాణి సాగు చేపట్టి 40రోజులవుతుండటంతో పంటకు యూరియా అందక ఎర్రబడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు మధ్యాహ్న సమయంలో యూరియా బస్తాలు రావడంతో పంపిణీ కార్యక్రమం ఒకింత ఘర్షణ వాతావరణాన్ని తలపించింది. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, ఏవో వరలక్ష్మీ, ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ రైతుసేవా కేంద్రం వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడారు. మరో 30 టన్నుల యూరియా సోమవారం వస్తుందని, ఆందోళన చెందవద్దని రైతులకు నచ్చజెప్పారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం..

యూరియా కొరత లేకుండా చూడాలని రైతుసంఘం నాయకులు కాకానబోయిన లింగారావు, కోట కృష్ణ, షేక్‌జాన్ సాహెబ్ ఆదివారం ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్‌ను కలిసి కోరారు. ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. రైతులకు సమృద్ధిగా యూరియా అందివకపోతే ఉద్యమం చేస్తామని వారు పేర్కొన్నారు.

బండిపాలెంను సందర్శించిన కలెక్టర్..

మండలంలోని బండిపాలెంలో సొసైటీ వద్ద చేపట్టిన ఎరువుల పంపిణీని జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా యూరియాను అందించాలని అధికారులను ఆదేశించారు. యూరియా కోసం ఆందోళన చెందవద్దని రైతుల అవసరాలకు అనుగుణంగా పంపిణీ చేస్తామని తెలిపారు.



ముచ్చింతాల గ్రామసచివాలయం వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

అన్నిగ్రామాల్లో అదే దుస్థితి..

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): పంటలను కాపాడుకునేందుకు ఒక్క యూరియా బస్తా దొరికినా చాలంటూ గ్రామాల్లో రైతులు ఎదురుచూస్తున్నారు. అనిగండ్లపాడు సొసైటీ పరిధిలోని ముచ్చింతాల గ్రామానికి ఆదివారం యూరియా కట్టలు వచ్చాయి. దీంతో రైతులు ఒక్కసారిగా యూరియా కట్టలు కోసం గ్రామ సచివాలయం వద్దకు చేరుకున్నారు. ప్రస్తుతం వరి పంటతోపాటు వరదలకు దెబ్బతిన్న మెట్ట పైర్లకు సైతం యూరియాను చల్లాల్సి ఉంది. అవసరమైన మేర యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈక్రమంలో యూరియా సచివాలయం వద్దకు వచ్చినట్లు తెలియగానే రైతులు ఒక్కసారిగా గుమికూడారు. దీంతో అధికారులు పోలీస్ సిబ్బందిని పిలిపించారు. అనంతరం రెవెన్యూ, వ్యవసాయాధికారులు కలిసి పాస్ బుక్‌కు రెండు కట్టల చొప్పున మొత్తం 500 బస్తాల యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఈక్రమంలో రైతులు మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ యూరియాకు ఇంతటి కొరత ఏర్పడలేదని గుర్తుచేస్తున్నారు. యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇకనైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి పంటలకు అవసరమైన మేర యూరియాను సరఫరా చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అధిక ధరలకు అమ్మితే లైసెన్స్ రద్దు

జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



మక్కపేటలో కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశకు యూరియా సమస్యను వివరిస్తున్న రైతులు

మక్కపేట(వత్సవాయి): యూరియాను ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే అధిక ధరకు విక్రయిస్తే ఆయా షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. మండలంలోని వత్సవాయి గ్రామంలో సొసైటీ ద్వారా సాగుతున్న యూరియా పంపిణీపై రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రైతులు కూడా యూరియా బదులు ప్రత్యామయంగా నానో యూరియా, నానో డీఏపీలను వినియోగించాలని సూచించారు. భవిష్యత్ కాలమంతా నానో మందులదేనని, అందుకనుగుణంగా రైతులు ఇప్పటినుంచే వాటి వినియోగాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. సొసైటీల ద్వారా రైతులకు యూరియాను పంపిణీ చేస్తున్నామన్నారు. బహిరంగ మార్కెట్లో అధికధరలకు అమ్మినట్లు తెలిస్తే సదరు షాపుల వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ, జగ్గయ్యపేట ఏడీఏ భవాని, సర్పంచ్ మల్లెల శివ, సొసైటీ అధ్యక్షులు సత్తి బేతోలు, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఏఓ జి.సత్యనారాయణ ఉన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో...

కొణకంచి(పెనుగంచిప్రోలు): రైతులకు యూరియా కొరత లేకుండా సరఫరా చేస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ తెలిపారు. మండలంలోని కొణకంచి గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. యూరియా పంపిణీని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన పెంచుకోవాలని కోరారు. మండలంలోని కొణకంచి, అనిగండ్లపాడు, పెనుగంచిప్రోలు, తోటచర్ల సొసైటీలకు ఆదివారం 75 టన్నుల యూరియా వచ్చిందని, అనిగండ్లపాడు, కొల్లికూళ్ల సొసైటీలకు సోమవారం వస్తుందని వ్యవసాయాధికారులు వివరించారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ, తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి, జగ్గయ్యపేట ఏడీఏ సి.భవాని, ఏఓ కె. రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

వీరులపాడు: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని ఎస్ఐ అనిల్ హెచ్చరించారు. వీరులపాడు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నేరచరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ముఖ్యంగా అసాంఘిక కార్యకలాపాలు, ఘర్షణలు, వివాదాల్లో తలదూర్చుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠినచర్యలు తప్పవని తెలిపారు. నేరమయ జీవితాన్ని మానుకుని కుటుంబసభ్యులతో సంతోషకర జీవనాన్ని గడపాలని సూచించారు. అనంతరం ఎటువంటి నేరాలకు పాల్పడమని రౌడీషీటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నాయకులకు ఘనసత్కారం



అనుబంధ విభాగాల జిల్లా కార్యదర్శులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, పటిష్టతకు కృషి చేసే వారికి పార్టీలో ఎల్లప్పుడూ తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందని నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పార్టీ అనుబంధ విభాగాల జిల్లా కార్యదర్శులుగా ఎన్నికైన వారిని స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి పార్టీ ఆధ్వర్యంలో పోరాడాలని నాయకులకు సూచించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహనరెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పార్టీ పదవులు పొందిన ప్రతిఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. రైతు విభాగం జిల్లా కార్యదర్శులు రాయల నరసింహారావు, కందుల బుచ్చి రామయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు చలమల శ్రీనివాసరావు, ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ మున్నా, జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ అలీ, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి జయరాజు, కార్యదర్శి పాపట్ల స్వామిలను అభినందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చందర్లపాడు జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, పార్టీ పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్, నాయకులు మంచాల చంద్రశేఖర్, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, వైఎస్ఎస్ ప్రసాద్, ఓర్సు కొండ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగ అభివృద్ధి అత్యంత కీలకం

కలెక్టర్ లక్ష్మీశ



చెవిటికల్లులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

నందిగామరూరల్/కంచికచర్ల: స్వర్ణాంధ్ర, వికసిత భారత్ సాకారానికి రైతుసంక్షేమంతోపాటు వ్యవసాయ రంగ అభివృద్ధి అత్యంత కీలకమని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. అగ్రికల్చర్ అవుట్‌రిచ్ (జన జాగృతి) కార్యక్రమంలో భాగంగా నందిగామ మండలంలోని ఐతవరం, కంచికచర్ల మండలంలోని చెవిటికల్లు గ్రామ రైతులతో ఆదివారం ఆయన ముచ్చటించారు. యూరియా సరఫరా ప్రక్రియను పరిశీలించారు. గ్రామంలో పర్యటించి ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం జిల్లాలో యూరియా, ఇతర ఎరువుల సరఫరా సజావుగా సాగుతోందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖతోపాటు ఆయా శాఖల అధికారులు గ్రామాల్లోని సొసైటీల్లో అందుబాటులో ఉన్న ఎరువులు, వారం తరువాత వచ్చే ఎరువుల వివరాలను ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని ఆదేశించారు. నానో యూరియా ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.బాలకృష్ణ, ఏవో గింజుపల్లి నాగేశ్వరరావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

యూరియా కొరత సంపద సృష్టిలో భాగమే

ప్రభుత్వ తీరుపై వైఎస్సార్ సీపీ ఎద్దేవా



అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు



పేటలో మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, ప్రక్కన ఇంటూరి చిన్నా తదితరులు

నందిగామటౌన్: రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరత టీడీపీ నేతలకు సంపద సృష్టించడంలో భాగమేనని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ యూరియా దొరకక రైతులు అవస్థలుపడుతున్నారన్నారు. రాష్ట్రానికి 1.62 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉన్నా, సగమే వచ్చిందని ఆ శాఖాధికారులే చెబుతున్నారన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం యూరియా అందించక పోగా, యూరియా అధికంగా వినియోగించవద్దని చెప్పడమేమిటని ప్రశ్నించారు. బాధ్యాతాయుతమైన ప్రతిపక్షంగా రైతు సమస్యలపై పోరాడుతున్నామని స్పష్టం చేశారు.

ఆర్‌బీకేలు నిర్వీర్యం...

రైతులకు అన్ని రకాలుగా సేవలందించే రైతుభరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని జగన్‌మోహనరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు తదితరాలను అందించిన వైనాన్ని గుర్తుచేశారు. గతంలో వ్యవసాయం దండగ అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు మరోసారి ఆచరణలో ఆ వ్యాఖ్యలను నిజం చేస్తున్నారన్నారు. ఎరువులు అందుబాటులో లేకుంటే రైతులు వ్యవసాయం చేయలేరని, తద్వారా వ్యవసాయాన్ని దండుగ చేసే ప్రయత్నాలను కూటమి ప్రభుత్వం ముమ్మరం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు...

రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని జగన్‌మోహనరావు విమర్శించారు. కూటమి పాలనలో రైతుల పరిస్థితి ముందు గొయ్యి వెనుక నుయ్యి అన్న చందంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై రైతన్నకు బాసటగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 9న నందిగామలో 'అన్నదాత పోరు' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చందర్లపాడు జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు మహ్మద్ మస్తాన్, మంచాల చంద్రశేఖర్, నాయకులు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, చిలుకూరి బుచ్చిరెడ్డి, గరికపాటి భాస్కరం, వెలగపూడి వెంకటేశ్వరరావు, వైఎస్ఎస్ ప్రసాద్, శాఖమూరు వెంకట కుమారి, గాడిపర్తి రామకృష్ణ, బుగ్గినేని సురేష్, షేక్ మున్నా పాల్గొన్నారు.

మొద్దునిద్రలో చంద్రబాబు ప్రభుత్వం : తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: యూరియా అడిగే రైతులను జైల్లో పెడతామంటూ సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొనడం రైతుసంక్షేమంపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 9వతేదీన నందిగామలో తలపెట్టిన 'అన్నదాత పోరు' పోస్టర్‌ను స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సమస్యలపై మొద్దు నిద్రపోతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. యూరియా అడిగి రైతులను జైల్లో పెడతామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అండగా నిలవాల్సింది పోయి, వారినే జైల్లో పెడతామని బెదిరించడమేమిటని ప్రశ్నించారు. రైతులకు యూరియా కూడా సరిగా అందించలేని అసమర్థ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టి రైతులందరికీ సక్రమంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. యూరియా కోసం కిలోమీటర్ల పొడవునా క్యూలైన్లు కనిపిస్తున్నా, ఎరువుల కొరత లేదని చంద్రబాబు చెబుతుండటం రైతులను నిలువునా మోసం చేయడమేనన్నారు. రైతుల సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు ఈనెల 9వ తేదీన నందిగామ ఆర్డీవో కార్యాలయం వద్ద శాంతియుతంగా ఆందోళన చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులను కోరారు. కార్యక్రమంలో ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా), రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాసగౌడ్, పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, మూడు మండలాల అధ్యక్షులు బూడిద నరసింహారావు, పొన్నం కోటేశ్వరరావు, గుత్తా శంకరరావు, నేతలు శివరాత్రి పృధ్వీ, సత్యశ్రీనివాసరావు, నంబూరి రవి, బత్తుల రామారావు, దర్శనాల వెంకటరమణ, బెడదం సత్యనారాయణ, షేక్ జుబేర్, బజారు సాయి పాల్గొన్నారు.

ముగిసిన వినాయక నిమజ్జనాలు



నందిగామలో నిమజ్జనానికి తరలిన గణనాథుడు



జగ్గయ్యపేటలో మహిళల కోలాట నృత్యాలు



వేదాద్రి వద్ద నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు

నందిగామరూరల్: వినాయకచవితి పండుగ సందర్భంగా పట్టణంతోపాటు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మంటపాలలో కొలువుదీరిన గణనాథులను భక్తులు ఆదివారం నిమజ్జనానికి తరలించారు. 11రోజులపాటు నిత్య పూజలందుకున్న గణనాథులను ఆయా మండపాల నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉంచి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.

జగ్గయ్యపేట పట్టణంలో...

జగ్గయ్యపేట అర్బన్: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆయా మండపాలలో కొలువై ఉన్న గణనాథులకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. స్థానిక పాతపేట గడ్డపై ఏర్పాటుచేసిన ఏకో గణపతి విగ్రహం నిమజ్జనం కార్యక్రమంలో కేరళ సంప్రదాయ వాయిద్య బృందాల సందడితో ప్రత్యేకాకర్షణగా నిలిచింది. 23వ వార్డులోని టీం ఎంజీబీ యూత్ ఆధ్వర్యంలో గణనాథుని నిమజ్జనం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కమటాల మహేష్, కనిగిరి భాను, కమటాల సతీష్, కనిగిరి సుబ్బారావు, గడ్డం చంద్రశేఖర్, శ్రీకాంత్, సంగెపు కార్తీక్, కమటాల లాల్సు, నాగమల్లేశ్వరరావు, నాగేంద్ర, కత్తి గోపి, ప్రసాద్, మందుల తేజ, దుప్పల నరసింహారావు పాల్గొన్నారు.

నిమజ్జనం సందర్భంగా వసూళ్లు...

వేదాద్రి(జగ్గయ్యపేట): మండలంలోని కృష్ణానది వద్ద ఆదివారంతో గణపతి నిమజ్జనాలు ముగిశాయి. చంద్రగ్రహణం నేపథ్యంలో ఆయా గ్రామాలలోని గణనాథులను మధ్యాహ్న సమయంలో కృష్ణానది వద్ద నిమజ్జనం చేశారు. అయితే పోలీస్, దేవస్థాన అధికారులు పంటు ఏర్పాట్లు చేసినందుకు ఒక్కో విగ్రహానికి రూ.రెండు. మూడు వేలు డిమాండ్ చేస్తుండటంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిమజ్జనాలకు ప్రత్యేకంగా ఏసీపీని నియమించినప్పటికీ ఆయన ఆ ప్రాంతం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో స్థానిక పోలీసు, దేవస్థాన అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా డబ్బులు వసూలు చేస్తున్నారని భక్తులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా గరుడ వాహనసేవ



స్వామివారి గరుడసేవలో భక్తులు

నందిగామ రూరల్: భాద్రపద పౌర్ణమి సందర్భంగా మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న అలివేలు మంగా, పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారికి ఆదివారం నిర్వహించిన గరుడ వాహనసేవ కన్నులపండువగా సాగింది. ఆలయ అర్చకుడు పవన్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి వైఖానస సాంప్రదాయం ప్రకారం విశేష పూజలు చేశారు. ముందుగా సుదర్శన హోమం, అర్చనలు, అభిషేకాలు, మూలమంత్ర హోమాది క్రతువులను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన గరుడవాహనంపై ఉంచి ఆలయ పరిసరాలలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఆయా గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కవ్వింపు చర్యలకు పాల్పడిన టీడీపీ మూకలు



అక్కారావు ఇంటి లోపల టీడీపీ మూకలు విసిరిన పువ్వులు

కంచికచర్ల: వినాయకస్వామిని అడ్డంపెట్టుకుని టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడిన సంఘటన మండలంలో శనివారం రాత్రి కంచికచర్ల మండలం గొట్టుముక్కలలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గొట్టుముక్కలలో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని శనివారం రాత్రి నిమజ్జనానికి తరలించారు. ఈక్రమంలో డీజేలో టీడీపీ పాటలు పెట్టి బాణాసంచా పేల్చుతూ ఊరేగించారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ గుదే అక్కారావు ఇంటి సమీపంలోకి వచ్చాక ఊరేగింపు బండిని గంటసేపు ఆయన ఇంటిముందు ఉంచి బాణసంచా కాల్చారు. కాల్చిన బాణసంచాలతోపాటు పూలను కూడా అక్కారావు ఇంట్లోకి విసిరి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో అక్కారావు కుటుంబసభ్యులు భయాందోళనకు గురయ్యారు. బయటకు వచ్చి ఇదేంపని అడుగుదామంటే టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఘర్షణ పెట్టుకుని దాడి చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. దీంతో తలుపులు వేసుకుని ఇంట్లో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపినట్లు అక్కారావు ఆదివారం 'సాక్షి'కి వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లవద్ద ఇదేవిధంగా హల్‌చల్ చేయడం గమనార్హం. సాక్షాత్తూ వినాయకస్వామిని అడ్డంపెట్టుకుని టీడీపీ నాయకులు అరాచకాలకు పాల్పడుతున్నారని గ్రామప్రజలు మండిపడ్డారు.

• దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించిగా, పలువురు భక్తులు, ఉభయదాతలు సేవలో పాల్గొన్నారు.